
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
సోమవారం 3 నవంబరు 2025



నేటి నుంచి ప్రైవేటు కళాశాలల బంద్

గజ్వేల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ప్రైవేటు కళాశాలల నిరవధిక బంద్‌ను నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా ప్రైవేటు కళాశాలల సంఘం ప్రధాన కార్యదర్శి చిన్నరాములు ఆదివారం తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకపోవడంతో మేనేజ్మెంట్‌లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. అన్ని కళాశాలలు బంద్‌లో పాల్గొనాలని కోరారు. నవంబరు 6న జరిగే లెక్చరర్లు, అధ్యాపకుల బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు.

సంగారెడ్డి అంబేడ్కర్ స్టేడియం అభివృద్ధికి రూ.10కోట్లు మంజూరు

- జీవో విడుదల చేసిన ప్రభుత్వం
- వివరాలు వెల్లడించిన జగ్గారెడ్డి, నిర్మల

సంగారెడ్డి టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియం గ్రౌండ్ అభివృద్ధికి రూ. 10కోట్లు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఆదివారం జీవోను విడుదల చేసింది. నిధులు విడుదల చేసినందుకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి, నిర్మలారెడ్డి మాట్లాడుతూ ఈ నిధులతో ఇండోర్ స్టేడియంలో సైనాథటిక్ కోర్టులు, బాస్కెట్ బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, హ్యాండ్‌బాల్ , అధునాతన హంగులతో ఇండోర్ స్టేడియంతో పాటు వాకింగ్ ట్రాక్, లైటింగ్ అథ్లెటిక్ కోర్టు ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అడిగిన వెంటనే అంబేడ్కర్ స్టేడియం అభివృద్ధి కోసం రూ.10కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ మౌలిక సదుపాయాల కల్పన చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జూలకంటి ఆంజనేయులు, కూన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



నిధుల వివరాలను తెలిజేస్తున్న జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి



GOVERNMENT OF TELANGANA
ABSTRACT
YAT&C (Sports) Department – Sanction of an amount of Rs.10.00 Crore (Rupees Ten Crore only) to the Vice Chairman & Managing Director, Sports Authority of Telangana, Hyderabad towards up-gradation of Dr.B.R.Ambedkar Stadium, Sangareddy District – Orders – Issued.
YOUTH ADVANCEMENT, TOURISM & CULTURE (SPORTS) DEPARTMENT
G.O.Rt.No.328 Dated: 01.11.2025
Read:
ORDER:
(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)
JAYESH RANJAN
SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT
//FORWARDED :: BY ORDER//

నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఆర్డర్ కాపీ



నేడు కొల్లూరుకు మంత్రుల రాక
పాఠశాల భవనానికి శంకుస్థాపన

మూతపడిన పరిశ్రమలో అగ్నిప్రమాదం
7

తరుగు.. 5 కిలోలు!

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దోపిడీ



హవేళీఘనపూర్‌లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

5 కిలోలు అదనంగా తూకం

కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకువస్తే తాలు, పొల్లు, తేమశాతం అధికంగా ఉందని నిర్వాహకులు వేధిస్తున్నారు. క్వింటాలుకు ఐదు కిలోలు ఎక్కువ తూకం వేస్తున్నారు. హమాలీ పేరిట రూ.30 వసూలు చేస్తున్నారు.

-బాయికాడి సిద్ధయ్య, హవేళీఘనపూర్

పట్టించుకునే వారు లేరు

కొనుగోలు కేంద్రంలో ప్రతీ 40 కిలోల బస్తాకు రెండు కిలోలు ఎక్కువగా తూకం వేస్తున్నారు. ఇది చాలదన్నట్లు బస్తా బరువు దీనికి అదనంగా తీసుకుంటున్నారు. ఇదేమిటని ప్రశ్నించినా నిర్వాహకులు పట్టించుకోవడం లేదు.

-రమేష్ రైతు, పోతంశెట్టిపల్లి

మెదక్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎండావానలకు ఓర్చి పండించిన పంటను అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాలకు తీసుకుపోతే నిలువునా దోచుకుంటున్నారు. అధికారులు హెచ్చరించినా పట్టించుకోకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తరుగు పేరిట అదనంగా తూకం వేస్తున్నారు. కేంద్రాల్లో మోసాలను అధికారులు నిలువరించలేక పోతున్నారు. ప్రతీ ఏటా సీజన్ ప్రారంభం నుంచి కలెక్టర్ మొదలుకొని సివిల్‌సప్లై అధికారుల వరకు రైతులు తెచ్చే ధాన్యం తూకంలో కోతలు విధించకూడదని హెచ్చరిస్తున్నా నిర్వాహకులు పెడచెవిన పెడుతూనే ఉన్నారు. ఈసారి కూడా కోతలు విధించడం మొదలైంది.

హెచ్చరించినా ఉపయోగం లేదు..

కొనుగోలు కేంద్రాల్లో ప్రతీ బస్తాకు 40 కిలోలు తూకం వేయాల్సి ఉంటుంది. బస్తా బరువు (450) దీనికి అదనం. అంటే ప్రతీ బస్తాలో 40.450 కిలోలు తూకం వేయాలి. కానీ జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాల్లో బస్తాకు 42.450 కిలోలు తూకం వేసి.. 40 కిలోలకు మాత్రమే రశీదు ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. మిల్లర్లు పెట్టే కొర్రీల వల్లే తరుగుతో ధాన్యం తూకం వేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయాన్ని పౌర సరఫరాలశాఖ డీఎం జగదీష్ దృష్టికి తీసుకురాగా అధనంగా తూకం వేస్తే కేంద్రాల నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

లక్ష్యం 3.20 లక్షల టన్నులు

మెదక్ జిల్లాలో 2.98 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈసారి 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి సేకరించాలని పౌర సరఫరాలశాఖ అంచనా వేసింది. ఇందులో 2 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, 1.20 లక్షల టన్నులు సన్నరకం సేకరించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 508 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇప్పటివరకు 3,326 మంది రైతుల నుంచి 14,470 టన్నుల దొడ్డు రకం, 2,530 మంది రైతుల నుంచి 1,389 టన్నుల సన్నరకం వడ్లు సేకరించినట్లు అధికారులు పేర్కొన్నారు.

జూబ్లీహీట్

తెలుగు రాష్ట్రాల్లో హాట్‌టాపిక్‌గా మారిన జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో ఉమ్మడి మెదక్ జిల్లా రాజకీయ నేతలు నిమగ్నమయ్యారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన ముఖ్యనాయకులు అక్కడే మకాం వేశారు. ద్వితీయ శ్రేణి నేతల ఆధ్వర్యంలో కార్యకర్తలంతా ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. పది రోజులుగా నగరంలోనే బస చేస్తూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే ముమ్మరంగా ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఈనెల 11వ తేదీన ఉప ఎన్నిక పోలింగ్ జరగనున్న క్రమంలో రెండ్రోజుల ముందుగానే ప్రచారాన్ని ముగించాల్సి ఉంది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఆయా పార్టీల ముఖ్యనేతలు దిశానిర్దేశం చేస్తున్నారు.



బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచార సమావేశంలో ఎంపీ రఘునందన్‌రావు

ప్రచారంలో మేము సైతం

ఉప ఎన్నికల క్యాపెయినింగ్‌లో ఉమ్మడి జిల్లా నేతలు

- నగరంలో మకాం వేసిన ముఖ్యనాయకులు
- హరీశ్ ఆధ్వర్యంలో వంద ఓట్ల ఇన్‌చార్జిల ఎంపిక
- కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రి పొన్నం
- అక్కడే ఎంపీ రఘునందన్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి



కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ప్రచారం

సంగారెడ్డి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాలు సహా, హుస్నాబాద్ నియోజకవర్గం, చేర్యాల ప్రాంతాలకు చెందిన రాజకీయ నాయకులు జూబ్లీహిల్స్‌లోనే ప్రచారం చేస్తుండడంతో స్థానికంగా ఆసక్తి రేపుతోంది. ఇక్కడి నేతల ప్రభావం అక్కడ ఎంత వరకు పనిచేస్తుందోనని చర్చ జరుగుతోంది.

హరీశ్‌రావు దిశానిర్దేశం..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదలైన వెంటనే జిల్లాకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అక్కడ వాలిపోయారు. పార్టీ అధినేత కేసీఆర్ సూచనల మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సమన్వయం చేసుకుంటూ జూబ్లీహిల్స్‌లో అడుగుపెట్టారు. పలు రోడ్‌షోలు, సమావేశాల్లో తనవాణి వినిపించారు. ఉమ్మడి మెదక్ జిల్లాతోపాటు ఇతర జిల్లాల నేతలకు ఆ నియోజకవర్గంలోని డివిజన్లు, వార్డులు, కాలనీలవారీగా ఇన్‌చార్జి బాధ్యతలు



ప్రచారంలో పటాన్‌చెరు బీఆర్ఎస్ కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్

మిగతా 7వ పేజీలో

1,012 భూభారతి దరఖాస్తుల పరిష్కారం

మెదక్ అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భూభారతి స్పెషల్‌డ్రైవ్‌లో పది రోజుల్లో 1,012 దరఖాస్తులను పరిష్కరించినట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 22 నుంచి నవంబర్ 1 వరకు తహసీల్దార్ పరిధిలో 183, ఆర్డీవో పరిధిలో 661, కలెక్టర్ స్వయంగా 168 ఫైల్స్‌ను శాశ్వతంగా పరిష్కరించారన్నారు. తహసీల్దార్ల పరిధిలో 1424 దరఖాస్తుల విచారణ పూర్తి చేసిన ఆర్డీవోలకు పంపారన్నారు. 76 ఆర్డీవో, అదనపు కలెక్టర్ 61 దరఖాస్తులను కలెక్టర్‌కు వెళ్లడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు మొత్తం 2573 ఫైల్స్‌ను వివిధ స్థాయిలో పరిష్కరించామన్నారు. పెండింగ్ దరఖాస్తులను ఇదే స్ఫూర్తితో పరిష్కరించాలని ఆదేశించారు.

ఐఐటీహెచ్‌లో ఉద్యోగాల పేరిట టోకరా

- నిరుద్యోగుల నుంచి రూ. లక్షల్లో వసూళ్లు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు

కంది, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఉన్న హౌస్‌కీపింగ్, గార్డెనింగ్, సెక్యూరిటీ, ఎలక్ట్రీషియన్, హెల్పర్ వంటి కాంట్రాక్టు ఉద్యోగాలు ఇప్పిస్తామని కొందరు దళారులు నిరుద్యోగులను మభ్యపెట్టి రూ.లక్షల్లో వసూలు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఐఐటీహెచ్‌లో కాంట్రాక్టు ఉద్యోగాలకు అర్హతతో సంబంధం లేకుండా కొందరు దళారులు నిరుద్యోగులను ఆసరాగా చేసుకుని రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేసినట్లు బాధితులు ఆదివారం 'ఆంధ్రజ్యోతి'కి చెప్పుకొని తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇటీవల సదాశివపేటకు చెందిన ఓ యువకుడి వద్ద నుంచి ఐఐటీహెచ్ చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న కొందరు దళారులు రూ.50 వేలు తీసుకొని ఓ కాంట్రాక్టు ఉద్యోగం ఇప్పించారు. అతను రెండునెలలు కూడా సరిగా డ్యూటీ చేయకుండానే మరో రూ.50 వేలు కావాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యోగం నిలిపివేస్తామని, సర్టిఫికెట్లు కూడా తిరిగి ఇవ్వమని బెదిరించారు. దీంతో భయపడిన సదరు బాధితుడు ఆదివారం సంగారెడ్డి రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. విషయం తెలుసుకున్న దళారులు తమ గుట్టు ఎక్కడ బయట పడుతుందోనని బెంబేలెత్తిపోయి బాధితుల వద్దకు ఉరుకుల పరుగుల మీద తమ మనుషులను పంపించారు. వ్యవహారం ఐఐటీహెచ్ దాకా తెలియకుండా వారికి నచ్చజెప్పి సెటిల్మెంట్ చేసుకున్నారు. ఈ విషయం ఎవరికైనా చెబితే మీ సంగతి చూస్తామంటూ బాధితులను మళ్లీ భయపెట్టే ప్రయత్నం చేశారు. ఇలా వందల మంది నుంచి ఈ దళారులు కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఇస్తామని రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు వసూలు చేసి కోట్లకు పడగలెత్తారని బాధితులు తెలిపారు. దళారులు తమను బెదిరించిన ఫోన్ రికార్డులు, వారికి డబ్బులు ఇచ్చేటప్పుడు తాము సెల్‌ఫోన్లలో చిత్రీకరించిన వీడియో రికార్డులను త్వరలోనే బయటపెడతామని బాధితులు పేర్కొన్నారు.

గడువులోపు.. గగనమే..!

- నత్తనడకన సంగారెడ్డి నర్సింగ్ కాలేజీ నిర్మాణం
- నవంబరులో అందుబాటులోకి తెస్తామని మంత్రి హామీ
- నెమ్మదించిన పనులు.. మరో 3-4 నెలలు పట్టే అవకాశం
- రెండేళ్లుగా అద్దె భవనాల్లోనే..



సంగారెడ్డి రాజంపేటలో నిర్మాణంలో ఉన్న నర్సింగ్ కాలేజీ భవనం

సంగారెడ్డి అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు రెండేళ్లుగా అరకొర సౌకర్యాల నడుమ అద్దె భవనాల్లో అవస్థలు పడుతున్నారు. కొత్త భవనాల కోసం వారి నిరీక్షణ ఇప్పట్లో తీరేలా లేదు. సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని మహిళా ప్రాంగణంలో రెండేళ్లుగా ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ తరగతులు, హాస్టల్స్ కొనసాగిస్తున్నారు. ఆగస్టు 30న ఓ విద్యార్థిని హాస్‌లో పాము రావడం కలకలం రేపింది. దీంతో విద్యార్థినులు భయాందోళనలో కాలం వెల్లదీస్తున్నారు. సెప్టెంబరు 4వ తేదీన ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. నవంబరు నాటికి ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ భవనాలను అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. కానీ, భవన నిర్మాణ పనుల వేగం చూస్తుంటే మరో మూడు, నాలుగు నెలలైనా పట్టే అవకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. అంటే, మంత్రి చెప్పినట్లు నవంబరు లోపు కొత్త భవనాలు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

పనుల్లో తాత్సారం

రెండతస్తుల నర్సింగ్ కాలేజీ భవనం, రెండతస్తుల హాస్టల్ భవన నిర్మాణాలకు ప్రభుత్వం 2023 జూలైలో రూ.34 కోట్లు కేటాయించింది. వీటి నిర్మాణ బాధ్యతలను టీజీఎంఎస్ఐడీసీకి అప్పగించింది. కాంట్రాక్టర్ కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం నర్సింగ్ కాలేజీ, హాస్టల్ భవన నిర్మాణాలన్నీ 2024 అక్టోబరులో పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలి. పనులు పూర్తికాకపోవడంతో అగ్రిమెంట్ గడువును 2025 మే నెల వరకు పొడిగించారు. అయినా పనుల్లో ఏ మాత్రం పురోగతి కనిపించడం లేదు. మళ్లీ అగ్రిమెంట్ గడువు పెంచినా పనుల్లో తీవ్ర తాత్సారం జరుగుతూనే ఉన్నది. నిధుల విడుదలలో జాప్యం ఫలితంగానే భవనాల నిర్మాణ పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని చెప్పుకుంటున్నారు. పూర్తిచేసిన పనులకు బిల్లులు విడుదల చేయకపోవడంతో పనులు కొనసాగించడానికి కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు. ఆరోగ్యశాఖ మంత్రి జిల్లాలోనే ఈ పరిస్థితులు ఉండడంపై విమర్శలు వస్తున్నాయి.

మెదక్ జిల్లాలో 18,600 మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



వడ్లలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నిజాంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో ఇప్పటి వరకు 18,600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, డబ్బుల చెల్లింపులో పారదర్శకత పాటించాలని సూచించారు. రైతులు ధాన్యం తీసుకొచ్చిన రోజే రిజిస్టర్లో నమోదు చేసుకొని సీరియల్‌వారీగా కొనుగోలు చేయాలని సూచించారు. నిర్దిష్ట తేమ శాతానికి రాగానే ధాన్యం కొనుగోలు చేయాలని, సేకరించిన ధాన్యాన్ని లోడ్ చేసిన వెంటనే మిల్లుకు తరలించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.



సంగారెడ్డిలో వైద్యాధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లతో సమావేశమైన కామన్ రివ్యూ మిషన్ బృందం

సంగారెడ్డి జిల్లాలో నేటి నుంచి కేంద్ర బృందం పర్యటన

సంగారెడ్డి అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని 'కామన్ రివ్యూ మిషన్' బృందం పర్యటించనున్నది. ఆరుగురు సభ్యులతో కూడిన ఈ బృందం ఆదివారం సంగారెడ్డి డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రాం ఆఫీసర్లతో.. కేంద్ర బృంద సభ్యులు సమావేశమయ్యారు. నేటి నుంచి 6వ తేదీ వరకు జిల్లాలోని పలు ప్రభుత్వ ఆస్పత్రులను వారు సందర్శిస్తారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఫెసిలిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హ్యూమన్ రీసోర్స్, డయాగ్నోస్టిక్, క్వాలిటీ అష్యూరెన్స్, ఫైనాన్షిల్ మేనేజ్‌మెంట్, డేటా సిస్టమ్, మెటర్నల్, చైల్డ్ హెల్త్ సర్వీసెస్, టీబీ, ఎన్‌సీడీ, క్యాన్సర్, డయాలసిస్ సెంటర్లు, టీ-హబ్, పేషెంట్ సర్వీసెస్, పేషెంట్ సేఫ్టీ, మందుల లభ్యత తదితర అంశాలను క్షుణంగా పరిశీలించి కేంద్రానికి నివేదించనున్నారు.

డిజిటల్ పద్ధతిలో జనాభా లెక్కల సేకరణ

జీహెచ్ఎంసీ పరిధిలో ప్రయోగాత్మకంగా రామచంద్రాపురం డివిజన్‌లో..

రాష్ట్ర సెన్సెస్ విభాగం డైరెక్టర్ భారతి హోళికేరి



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న భారతీహోళికేరి

పటాన్‌చెరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జనాభా లెక్కల సేకరణ కార్యక్రమాన్ని డిజిటల్ పద్ధతిలో చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర సెన్సెస్ విభాగం డైరెక్టర్ భారతి హోళికేరి పేర్కొన్నారు. పటాన్‌చెరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. డిజిటల్ జనాభా లెక్కల సేకరణను ప్రయోగాత్మకంగా జీహెచ్ఎంసీ పరిధిలోని రామచంద్రాపురం డివిజన్, నల్గొండ జిల్లాలోని తిప్పర్తి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పినపాక గ్రామాల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 10 నుంచి 30 వరకు ఇంటింటికివెళ్లి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేస్తారని చెప్పారు. ఇందుకోసం రామచంద్రాపురం డివిజన్‌లో 73 మంది ఎన్యూమరేటర్లు, 12 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. సర్వే చేసే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, క్రమశిక్షణ పాటించాలని చెప్పారు. వచ్చే ఏడాది పూర్తిస్థాయిలో చేపట్టనున్న జనాభా లెక్కల సేకరణకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. డిజిటల్ సెన్సెస్ సర్వేతో కుటుంబ స్థితిగతుల వాస్తవాలు వెలుగులోకి వస్తాయని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీకర్ణన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ హేమంత్ కేశవ పటేల్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవ్‌రావు, సెన్సెస్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్, పటాన్‌చెరు ఉపకమిషనర్ సురేష్ పాల్గొన్నారు.

మూతపడిన పరిశ్రమలో అగ్నిప్రమాదం



రూప కెమికల్ పరిశ్రమలో ఎగిసిపడుతున్న మంటలు

పటాన్‌చెరు నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మూతపడిన పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగిన సంఘటన పటాన్‌చెరు పారిశ్రామికవాడలో చోటు చేసుకుంది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రూప కెమికల్స్ పరిశ్రమలో ఆదివారం రాత్రి సమయంలో గోదాములో నిల్వ చేసిన రసాయనాల డ్రమ్ముల నుంచి మంటలు వ్యాపించాయి. నిమిషాల సమయంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఆరు నెలలుగా పరిశ్రమను మూసి ఉండగా ఇద్దరు సెక్యూరిటీ గార్డులు కాపలా ఉంటున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బందికి అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. పటాన్‌చెరు, బీడీఎల్, సంగారెడ్డి, భెల్, అరబిందో, ఓడీఎఫ్ ప్రాంతాలకు చెందిన ఆరు అగ్నిమాపక వాహనాలత సహాయంతో మంటలను ఆర్పారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, సీఐ వినాయకరెడ్డి ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేశారు.

కల్తీ గమ్మత్తు

కల్లు తాగితే రెండు రోజులైనా దిగని మత్తు

- మనోహరాబాద్ మండలంలో పుట్టగొడుగుల్లా కల్లు దుకాణాలు
- అధిక మోతాదులో మత్తు పదార్థాల వాడకం
- ప్రాణాలు కోల్పోతున్న మందుబాబులు
- పరిశ్రమల కార్మికులే లక్ష్యంగా అమ్మకాలు
- మామూళ్ల మత్తులో అధికారులు!



ఖాళీ ప్లాట్‌లో ఏర్పాటు చేసిన కల్లు దుకాణం..





కల్లు తాగి పడిపోయిన మద్యం ప్రియులు

మనోహరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలోని మనోహరాబాద్ మండలం పరిశ్రమలకు కేంద్రంగా ఉంది. కార్మికులు ఎక్కువగా ఉంటారు. ఎంతోమంది అనేక రాష్ట్రాల నుంచి వలస వచ్చి ఇక్కడే అద్దెకు నివాసం ఉంటున్నారు. వీరు కుటుంబ పోషణ భారం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మద్యానికి అలవాటు పడుతున్నారు. మద్యం కొనేందుకు డబ్బులు లేక, మత్తు కోసం గ్రామంలో విచ్చలవిడిగా అమ్ముతున్న కల్లు దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో కల్లు దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కార్మికులే లక్ష్యంగా కల్తీ కల్లు, మద్యాన్ని విక్రయిస్తూ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారులు మామూళ్లకు అలవాటు పడి తనిఖీలు చేయకపోవడంతో నిర్వాహకులు మరింత రెచ్చిపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మోతాదుకు మించి..

కల్లులో మోతాదుకు మించి మత్తు పదార్థాలు కలుపుతుండడంతో తాగినవారికి రెండు రోజులైనా మత్తు దిగడం లేదు. ఈ నేపథ్యంలో పలువురు కల్తీకి కల్లుకు బానిసవుతున్నారు. వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉండడంతో కొంతమంది ఎక్కడ పడితే అక్కడ షెడ్లు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా కల్లు విక్రయిస్తున్నారు. ఏకగా పరిశ్రమల వద్ద, గ్రామ శివారులోని కార్మికులు ఉండే ఖాళీ ప్లాట్లలోనూ కల్లు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేయకపోవడంపై పలు అనుమానులకు తావిస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. యంత్రాంగం మండలంలో ఎప్పుడైనా ప్రమాదాలు జరిగితే, ప్రాణాలు పోతే తప్ప అటువైపు చూసిన దాఖలాలు లేవనే వాదనాలున్నాయి.

తాగారంటే.. పడిపోవాల్సిందే..

ఇక్కడి కల్లుగా తాగారంటే పడిపోవాల్సిందే. ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో గత జూలైలో ఒక దుకాణంలో కల్లు తాగి ముగ్గురు కార్మికులు అక్కడే మత్తులో పడిపోయారు. ఎక్కడ చూసినా కల్లు ప్రియులు పడిపోయి కనిపిస్తున్నారు. నిత్యం ఇదే కల్లు తాగడం వల్ల ప్రాణాలు కోల్పోయే ప్రమాదమున్నా సంబంధిత అధికారులు ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నిర్వాహకుల నుంచి అందుతున్న మామూళ్లే అందుకు కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.

విచ్చలవిడిగా బెల్టు షాపులు..

మరోవైపు విచ్చలవిడిగా కల్తీ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. కార్మికులనే ఆసరా చేసుకుని కిరాణా దుకాణాల్లో విక్రయిస్తున్నారు. ఇతర రాష్ట్రాల కార్మికులు పక్క రాష్ట్రాల నుండి గంజాయి తెచ్చి అమ్ముతున్నారు. ప్రతి రెండు నెలల వ్యవధిలో మండలంలో గంజాయి పట్టుకోవడం జరుగుతోంది. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు కార్మికులను దృష్టిలో పెట్టుకొని మనోహరాబాద్ మండలంలోని కల్తీ మద్యం, కల్లు దుకాణాల్లో తనిఖీలు చేసి కల్తీని కట్టడి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

రూ.5 కోట్ల విలువైన నక్షాబాటకు ఎసరు



నక్షాబాటను ఆక్రమించి నిర్మిస్తున్న ప్రహరీ

కంది, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల జోలికొస్తే ఉపేక్షించబోమని రెవెన్యూ అధికారులు హెచ్చరిస్తున్నా కంది మండలంలో రియాల్టర్లు ఏమాత్రం లెక్కచేయడం లేదు. ఓవైపు అసైన్డ్ భూములను అమ్ముతూ, మరోవైపు నక్షాబాటలను, కుంటలను, శిఖం భూములను కబ్జా చేస్తూ అధికారులకు సెలవు రోజు కూడా మనశ్శాంతి లేకుండా చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్న కంది మండలంలోని జుల్‌కల్ గ్రామంలో కొందరు అక్రమార్కులు సర్వేనెంబర్ 24లో ఉన్న దాదాపు ఎకరం మేర రూ.5 కోట్ల విలువైన నక్షాబాటకు ఎసరు పెట్టారు. కంది-శంకర్ పల్లి హైవే పక్కనే ఉన్న సదరు నక్షాబాట భూమిలో ఆదివారం అధికారులు ఎవరూ అందుబాటులో ఉండకపోవడంతో అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా ప్రహరీ నిర్మాణ చేపట్టారు. రెండు రోజుల క్రితమే జుల్‌కల్ పంచాయతీ అధికారులు ఇది అక్రమ నిర్మాణమని నోటీసులిచ్చినా లెక్కచేయకుండా ప్రహరీ పనులు చేపడుతున్నారు. దీంతో గ్రామంలో పొలాలకు వెళ్లే రైతులకు దారి లేకుండా పూర్తిగా మూసుకుపోయింది. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రహరీని తొలగించాలని కోరుతున్నారు

చిత్తుబొత్తు ఆడుతున్న 11 మంది అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

పెద్దశంకరంపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట మండల పరిధిలోని వీరోజిపల్లి గ్రామంలో చిత్తుబొత్తు ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. శనివారం అర్ధరాత్రి అనంతరం వీరోజిపల్లి కల్లు దుకాణం వెనుక చిత్తుబొత్తు ఆడుతున్నారని సమాచారం అందడంతో, పోలీసులు దాడి చేశారు. వారి దగ్గర నుంచి రూ.17709 నగదును, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని, వారిని పేట పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. వీరోజిపల్లి గ్రామానికి చెందిన పలువురిని ఈ ఘటనలో అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

సేవాలాల్ ఆలయంలో చోరీకి యత్నం



దొంగలు ఎత్తుకెళ్లిన ఆలయ హుండీ

మాసాయిపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : మాసాయిపేట మండలం రామంతాపూర్ గిరిజన తండాలోని సంత్ సేవాలాల్ ఆలయంలో చోరీ యత్నం జరిగింది. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గత నెల 22న ఆలయ హుండీ డబ్బులు చోరీ చేయడానికి గుర్తు తెలియని వ్యక్తులు ప్రయత్నించారు. హుండీని ఎత్తుకెళ్లి దూరంగా పగలగొట్టే ప్రయత్నం చేశారని తండావాసులు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు చేగుంట పోలీసులు తెలిపారు.

అక్రమంగా మట్టి రవాణా

- టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ పట్టివేత



పోలీసులు పట్టుకున్న టిప్పర్లు

తూప్రాన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : అర్ధరాత్రి సమయంలో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న రెండు మట్టి టిప్పర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన తూప్రాన్ మండలం నాగులపల్లి పంచాయతీ పరిధి జెండాపల్లిలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. తూప్రాన్ మండల సమీపం నుంచి అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో, తూప్రాన్-3 ఎస్‌ఐ యాదగిరి ఆధ్వర్యంలో దాడులు చేశారు. దాడుల్లో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న రెండు మట్టి టిప్పర్లు, టిప్పర్లలో మట్టిని నింపడానికి వినియోగిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను పట్టుకున్నారు. పట్టబడిన టిప్పర్లు, ఎక్స్‌కవేటర్‌ను తూప్రాన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బెల్ట్ షాపుపై దాడి



పట్టుకున్న మద్యం సీసాలను చూపిస్తున్న హెడ్ కానిస్టేబుల్ మురళీ

సిద్దిపేట రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని సిద్దిపేట రూరల్ ఎస్‌ఐ కె. రాజేష్ హెచ్చరించారు. ఆదివారం నారాయణరావుపేట మండల కేంద్రంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపుపై దాడి చేసి 12 లీటర్ల మద్యంను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాజేష్ మాట్లాడుతూ నారాయణరావుపేట మండల కేంద్రంలో కిరాణా దుకాణంలో ఓ వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. దాడిలో సుమారు రూ.12 వేల విలువైన 12 లీటర్ల మద్యం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అక్రమంగా మద్యం తరలించినా, విక్రయించినా చర్యలు తప్పవని తెలిపారు. అలాగే, గ్రామాల్లో ఎవరైనా మద్యం విక్రయిస్తున్నట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పిల్లలు పుట్టడం లేదని వ్యక్తి ఆత్మహత్య



బాలయ్య(ఫైల్)

జగదేవ్‌పూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో పాటు, పిల్లలు పుట్టడం లేదనే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జగదేవ్‌పూర్ మండలం అంతాయిగూడ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన తిగుళ్ల బాలయ్య(30), కల్యాణి దంపతులకు వివాహమై ఎనిమిదేళ్లు అవుతున్నా నేటికి పిల్లలు పుట్టడం లేదు. దీనికి తోడు ఆర్థిక సమస్యలు ఏర్పడడంతో గత నెల 28న ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న బాలయ్య పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సిద్దిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కొండ చిలువను చంపిన గ్రామస్థులు



కంగ్టి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాగూర్.కె గ్రామంలో ఆదివారం పంట పొలాల్లో కనిపించిన భారీ కొండ చిలువను గ్రామస్థులు చంపివేశారు. గ్రామానికి చెందిన రైతు విఠల్ రోజు మాదిరిగానే ఆదివారం పొలానికి వెళ్లాడు. పశువులకు మేత కోసుకునేందుకు సిద్ధమవుతుండగా భారీ పొడవైన కొండ చిలువ కనిపించింది. దీంతో విఠల్ చుట్టు పక్కన ఉన్న తోటి రైతుల సహాయంతో కొండ చిలువను కొట్టి చంపారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఈనెల 7న బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ సినిప్లెక్స్ - మూసాపేట్

GLOBAL CINEMAS RELEASE

SUPER DUPER HITTU BOMMA



దేవి 70 - ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్ 11.00,2.30,6.00,9.30
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

SUPER HIT నేడే చూడండి



సుదర్శన్ 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 9.30,1.45,6.00,10.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 9.00,1.30,6.00,10.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 1.45,6.00,10.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

GLOBAL CINEMAS RELEASE

ఈనెల 7న బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35 ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
లక్ష్మీకళ సినిప్లెక్స్ - మూసాపేట్

Ganga Entertainments 9966963111

విజయవంతమైన 3వ వారం





నిండుగా మాచిరెడ్డిపల్లిలోని నర్సిరెడ్డి చెరువు



భారీ వర్షాలకు నిండిన బడంపేటలోని దేవుని చెరువు

నిండుకుండల్లా నీటి వనరులు

● తాగు, సాగు నీటికి ఢోకా లేదంటున్న రైతులు

కోహీర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోహీర్ మండలంలోని ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగులు జలకళతో దర్శనమిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కురిసిన భారీ వర్షాల కారణంగా ఎడారిగా మారిన చెరువులన్నీ ప్రస్తుతం వరద నీటితో నిండుకుండల్లా మారాయి. కొన్ని సంవత్సరాల నుంచి నీరు లేక బీడువారిన చెరువులలో నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోహీర్ మండలంలోని 24 చెరువులు జలకళతో కనిపిస్తున్నాయి. గొటిగర్‌పల్లి గ్రామంలోని పెద్ద చెరువు నిండుకుండలా దర్శనం ఇవ్వడమే కాకుండా అలుగు దూకుతోంది. అలాగే పర్శపల్లిలోని రాముని చెరువు, బడంపేటలోని దేవుని చెరువు, ఈదులకుంట చెరువు, చింతలఘట్టు శివారులోని గుండం చెరువు, మాచిరెడ్డిపల్లిలోని నర్సిరెడ్డి చెరువుతో సహా ఇతర చెరువులన్నీ నిండాయి. చెరువులే కాకుండా వాగులు, వంకలు, చిన్న చిన్న కుంటలు కూడా వర్షపు నీటితో నిండిపోయాయి. దీంతో ఈసారి భారీ వర్షాలు నమోదవడం వల్ల భూగర్భ జలాలు అమాంతంగా పెరిగాయి. మండలంలోని బిలాల్‌పూర్, వెంకటాపూర్, మనియార్‌పల్లి, గొటిగర్‌పల్లి తదితర గ్రామాల్లో బోరు బావుల్లో నీరు పైకి వస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే వేసవి సీజన్‌లో సాగు, తాగు నీటికి ఇబ్బంది ఉండదని వారు పేర్కొంటున్నారు.



చింతలఘట్టు గుండం చెరువు

నేడు కొల్లూరుకు ముగ్గురు మంత్రుల రాక

● ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్ డైరెక్టర్ గౌతమ్

రామచంద్రాపురం టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ పురపాలక పరిధిలోని కొల్లూరుకు నేడు ముగ్గురు మంత్రులు రానున్నారు. రెండు పడక గదుల ఇళ్ల ప్రాంగణంలో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి వారు శంకుస్థాపన చేయనున్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వివేక్, దామోదర రాజనర్సింహ హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ ప్రావీణ్య, హౌసింగ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌతమ్ వివిధ కేటగిరీల అధికారుల బృందంతో కలిసి పర్యవేక్షించారు. ఉదయం నుంచి మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో మున్సిపల్ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత ప్రాజెక్టు కింద వీఎస్‌టీ కంపెనీ ఈ నిర్మాణాన్ని చేపట్టడానికి ముందుకొచ్చింది. హైదరాబాద్ రౌండ్‌టేబుల్ ట్రస్ట్, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ల సహకారంతో మొత్తం 56 తరగతి గదులు నిర్మించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే ఎకరం స్థలాన్ని కేటాయించింది. మొదటి దశలో రూ.5 కోట్ల అంచనా వ్యయంతో 28 తరగతి గదులు నిర్మించనున్నారు. వీటికి అనుబంధంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తారు. ప్రస్తుతం ఈ ప్రాంగణంలో 980 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు, వారిలో 760 మంది రోజువారీగా హాజరవుతున్నారు. వీరికి కమ్యూనిటీ భవనంలో తాత్కాలికంగా తరగతులు నిర్వహిస్తున్నారు.

ఎట్టకేలకు బడి భవనానికి మోక్షం

● రూ.50 లక్షలతో నిర్మాణం.. తీరనున్న విద్యార్థుల కష్టాలు



భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న రౌండ్‌టేబుల్ ఇండియా ప్రతినిధులు

నర్సాపూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలోని ప్రాథమిక పాఠశాల భవనం ఎన్నో ఏళ్లుగా పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉండడంతో విద్యార్థుల కష్టాలు ఎట్టకేలకు తీరనున్నాయి. ఒక స్వచ్ఛంద సంస్థ సహకారంతో కొత్త భవన నిర్మాణానికి మార్గం సుగమమైంది. స్థానిక జడ్జి హేమలత చొరవతో మండల లీగల్ కమిటీ ప్రత్యేక దృష్టి సారించి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. ఈ క్రమంలో స్వచ్ఛంద సంస్థల సహకారం కోసం ప్రయత్నించగా, హైదరాబాద్‌కు చెందిన రౌండ్‌టేబుల్ ఇండియా సంస్థ ముందుకు వచ్చింది. పాత శిథిల భవనం పూర్తిగా తొలగించి, రూ.50 లక్షలతో మూడు నెలల్లో కొత్త భవనం పూర్తి చేయడానికి ఈ సంస్థ అంగీకరించింది. శనివారం సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా భూమి పూజ కూడా చేశారు. దీంతో ఎన్నో సంవత్సరాలుగా ప్రమాదకరంగా ఉన్న భవనంలో చదువుతున్న విద్యార్థులకు త్వరలో నూతన భవనం రానుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలి

● ఆన్‌లైన్ గేమ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



ప్రేరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

కంది, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తులో రాణించాలంటే ప్రతీ విద్యార్థి లక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల మెరుగైన భవిష్యత్తు కోసం రూరల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఐఐటీహెచ్‌లో ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎస్పీ పాల్గొని ప్రసంగించారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా విద్యార్థుల భవిష్యత్తుపై పట్టు సాధించాలన్నారు. కష్టపడి చదివినప్పుడే విజయ తీరాలను చేరుకోగలమని తెలిపారు. ప్రస్తుత సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని కొనియాడారు. సైబర్ నేరగాళ్లు చిన్న పిల్లలనే లక్ష్యంగా లింక్స్ పంపుతూ నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఐఐటీహెచ్ సిబ్బంది, రూరల్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు డా.హిమబిందు, డా. శుహిత, డా.అర్వింద్, డా. ప్రేమ్‌పాల్, కంది మండల విద్యాధికారి జోగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల్లో జన సందోహం

● జలదిగ్బంధంలోనే దుర్గమ్మ



భక్తులతో కిట కిట లాడుతున్న ఏడుపాయల

పాపన్నపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల ఆదివారం భక్త జన సందోహంగా మారింది. సింగూరు నుంచి విడుదల చేసిన నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆలయం మూసి వేశారు. రాజగోపురంలో దుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఉంచి, పూజలు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు, అమ్మవారిని దర్శించుకొని ఒడి బియ్యం పోసి, బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా, ఆలయ సిబ్బంది, ఎస్సై శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు తీసుకున్నారు.

కేతకీలో ఘనంగా కార్తీక మాస దీపారాధన

ఝరాసంగం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కార్తీక మాసం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉదయం అమృత గుండంలో స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయ ఆవరణలో దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో శివరుద్రప్ప భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో స్వామి వారి కల్యాణం, గంగహారతి, లక్షదీపారాధన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ప్రచారంలో మేముసైతం

5వ పేజీ తరువాయి

అప్పగించారు. సిద్దిపేట ఫార్ములాను అనుసరించి జూబ్లీహిల్స్‌లోనూ వంద ఓట్ల జాబితాల వారీగా విభజించి వాటికి కూడా ఇన్‌చార్జిలను నియమించారు. ఈ క్రమంలో హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణ ఈనెల 28వ తేదీన చనిపోయారు. దీంతో హరీశ్‌రావు ప్రచారానికి తాత్కాలికంగా బ్రేక్ పడినప్పటికీ.. అక్కడ ఉన్న నాయకులు, కార్యకర్తలకు మాత్రం దిశానిర్దేశం చేస్తూనే ఉన్నారు. తనకు సమయం చిక్కినప్పుడల్లా ఉపఎన్నిక ప్రచారం, ఇతర పరిణామాలపై ఆరా తీస్తూ సూచనలు ఇస్తున్నారు. ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు సైతం ప్రచారంలోనే ఉన్నారు.

పొన్నం ప్రభాకర్ పర్యవేక్షణలో..

హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ జూబ్లీహిల్స్‌పైనే ప్రత్యేకంగా దృష్టిసారించారు. హైదరాబాద్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న ప్రభాకర్ పర్యవేక్షణలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ముఖ్యనేతలు ప్రచారం చేస్తున్నారు. డివిజన్ల వారీగా బాధ్యతలు కేటాయించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత మైనంపల్లి హనుమంతరావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అక్కడే మకాం వేశారు. ఇక మంత్రి దామోదర్ రాజనర్సింహ సైతం ఇటీవల జూబ్లీహిల్స్ ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఇదిలాఉంటే ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా పొన్నం ప్రభాకర్ వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు నిత్యం పొన్నం పర్యవేక్షణలో ప్రచారబాట పడుతున్నారు.

కీలకంగా రఘునందన్

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డి తరఫున స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్నారు. ఉపఎన్నిక నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి అక్కడే మకాం వేసి ప్రచారం చేస్తున్నారు. ప్రచార సభలు, రోడ్ షోలలో తనదైన శైలిలో మాట్లాడుతున్నారు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల బీజేపీ పార్టీ అధ్యక్షులను సమన్వయం చేస్తూ పార్టీ శ్రేణులను ప్రచారంలో పాల్గొనేలా పావులు కదిపారు. ఇక ఉమ్మడి జిల్లాకే చెందిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి సైతం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. తన సతీమణి గోదావరితో కలిసి ప్రచారంలో పాల్గొంటున్నారు.

జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో సిద్దిపేట క్రీడాకారుడి ప్రతిభ

● వరుస ఫుట్‌బాల్ మ్యాచుల్లో గోల్స్



ఫుట్‌బాల్ ఆడుతున్న అనస్

సిద్దిపేట కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరుగుతున్న నేషనల్ సబ్ జూనియర్ అండర్-13 టోర్నమెంట్‌లో సిద్దిపేట ఫుట్‌బాల్ క్రీడాకారుడు అనస్ అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ టీం సెలెక్షన్‌లో తెలంగాణ వ్యాప్తంగా 600 మంది క్రీడాకారులు హాజరు కాగా, అనస్ వారిని వెనక్కి నెట్టి ఎంపికయ్యాడు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న టోర్నమెంట్‌లో ప్రతి మ్యాచ్‌లోనూ తనదైన శైలిలో గోల్స్ చేస్తూ ప్రతిభ కనబరుస్తున్నాడు. ఉత్తరాఖండ్‌పై అనస్ తొలి గోల్ సాధించాడు. జమ్మూకశ్మీర్‌తో జరిగిన పోటీలోనూ అనస్ గోల్ చేశాడు. మేఘాలయ టీంతో జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో, చివరి నిమిషంలో అనస్ చేసిన గోల్‌తో తెలంగాణ టీం ఫైనల్‌కు చేరుకుంది. ఈ నెల 8న ఫైనల్ పోరు జరగనుంది. వరుస గోల్స్‌తో ప్రతిభ కనబరుస్తున్న అనస్‌ను తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పాల్గుణ అభినందించారు. అనస్ ఫుట్‌బాల్ కోచ్ అక్బర్ నవాబ్ మాట్లాడుతూ, సిద్దిపేట నుంచి ఒక క్రీడాకారుడు జాతీయ స్థాయికి ఎదగడం సంతోషంగా ఉందన్నారు. డీవైఎస్‌వో వెంకట నర్సయ్య, సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ సాజిద్, కార్యవర్గ సభ్యులు హరీశ్, లక్ష్మీనారాయణరెడ్డి అనస్‌కు అభినందనలు తెలిపారు.

క్రీడలతో వ్యక్తిత్వ వికాసం

● ఎస్‌జీఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి సౌందర్య



మల్లకంబలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సిద్దిపేట రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు క్రీడలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సౌందర్య అన్నారు. ఆదివారం నారాయణరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి మల్లకంబ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి సౌందర్య మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు నవంబర్ 4, 5, 6 తేదీల్లో చౌటుప్పల్‌లో రాష్ట్ర స్థాయి మల్లకంబ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనూ మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని కోరారు. చింతమడక, రాఘవాపూర్, నారాయణరావుపేట, తడకపల్లి ఆవాస విద్యాలయాల విద్యార్థులు అండర్-14, అండర్-17 బాలబాలికలు మొత్తం 50 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మల్లకంబ జిల్లా అధ్యక్షులు చిప్ప ప్రభాకర్, యోగా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు తోట సతీష్, వెంకట్ స్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముత్తంగిలో గంజాయి స్వాధీనం



నిందితులను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

పటాన్‌చెరు రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ముత్తంగి నుంచి ఇంద్రేశం వెళ్లే రింగ్ రోడ్ సర్వీస్ రోడ్‌లో ఆటోలో గంజాయి తరలిస్తుండగా మెదక్ ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నిందితులైన రామచంద్రపురం పట్టణానికి చెందిన జాదవ్ రవి, పటాన్‌చెరుకు చెందిన చౌహాన్ రాజులను అదుపులోకి తీసుకుని 12.810 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.4.50లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితుల నుంచి మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు విచారణ చేస్తున్నారు. ఈ దాడిలో మెదక్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు గాంధీ నాయక్, చంద్రశేఖర్, వీరారెడ్డి, ఎస్సైలు అనిల్ కుమార్, యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు అధ్వానం

● అద్దె, ఇరుకు గదులు, రేకుల షెడ్లలో విద్యాబోధన

● కొన్ని గ్రామాలలో చెట్ల కిందనే చదువులు



కాళ్లకల్‌లో మూతపడిన రెండో అంగన్‌వాడీ కేంద్ర భవనం

మనోహరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి అధ్వానంగా మారింది. కొన్ని చోట్ల సొంత భవనాలు లేకపోవడంతో చెట్లకిందనే చదువు ను కొనసాగిస్తున్నారు. మరికొన్ని చట్లో టీచర్లు తమ సొంత ఖర్చులతో భవనాలు ఏర్పాటు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి.మండలంలో సుమారు 17 గ్రామ పంచాయితీలలో కలిపి 25 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. ఎనిమిది కేంద్రాల్లో ఆయాలు లేక టీచర్లే పనులను నెట్టుకొస్తున్నారు. కాళ్లకల్ మేజర్ గ్రామ పంచాయతీలో కార్మికులు ఎక్కువగా ఉండటం, పరిశ్రమల ఏరియా కావడంతో మూడు అంగన్‌వాడీలు ఏర్పాటు చేశారు.

అద్దె రూ.6 వేలు.. ప్రభుత్వం ఇచ్చేది రూ.1000

ఇక్కడ అద్దె గదికి సుమారు రూ.6వేల వరకు చెల్లించాల్సి వస్తుంది. కానీ ప్రభుత్వం ఒక్కో అంగన్‌వాడీ గదికి కేవలం రూ.1,000 మాత్రమే చెల్లిస్తుందని టీచర్లు తెలిపారు. 25 అంగన్‌వాడీ సెంటర్లలో 13 మాత్రమే ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవనాలుండగా, మిగతావి మహిళా భవనం, ప్రభుత్వ పాఠశాలలు, జీపీ లేదా ఇతర సంఘ భవనాల్లో కొనసాగుతున్నాయి. రెండు అంగన్‌వాడీలు అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వం నుంచి అద్దె ఆరు నెలల వరకు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. అందులో పనిచేసే ఉపాధ్యాయులు వంట సామాగ్రి, కూరగాయల ఖర్చులకు కూడా తమ సొంత డబ్బు ఖర్చు చేసి, ఆరు నెలలకు ఒకసారి వచ్చినప్పుడు తీసుకుంటున్నారు.

చెట్లకిందనే చదువులు..

ఇక పర్కిబండ గ్రామ పరిధి తుపాకులపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ భవనం శిథిలమై పోవడంతో నాలుగు సంవత్సరాలుగా ప్రాథమిక పాఠశాల ఆవరణలోని చెట్టు కిందనే చదువులు కొనసాగిస్తున్నారు. కాళ్లకల్ గ్రామంలో రెండు అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా, ఒకటి మాత్రమే ప్రభుత్వం నిర్మించింది. మరో రెండు అద్దె గదిలో, రేకుల షెడ్డులో నడుస్తున్నాయి. రెండో సెంటర్ పెంకుటిల్లు శిథిలమైపోవడంతో, ప్రస్తుతం 2, 3 సెంటర్ల పిల్లలు ఒకే గదిలో చదువుకుంటున్నారు. ఈ సెంటర్‌లో పనిచేసే ఉపాధ్యాయురాలు అంగన్‌వాడీ కోసం తన సొంత స్థలంలో, సొంత నిధులతో రేకుల గది ఏర్పాటు చేసుకొని, అక్కడనే పిల్లలకు బోధిస్తున్నారు. ఈ వియమే మండల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మేహతబేగంను వివరణ కోరగా అంగన్‌వాడీల పరిస్థితి అధ్వానంగా ఉండడం వాస్తవమేనన్నారు. దీనిపై పై అధికారులకు సమాచారం అందిస్తున్నా ఫలితం లేదని, ఇప్పటికైనా దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.



తుపాకులపల్లి గ్రామంలో చెట్టకిందనే అంగన్‌వాడీ పిల్లలకు బోధన



తుపాకులపల్లిలో శిథిలావస్థకు చేరడంతో మూతపడిన అంగన్‌వాడీ కేంద్రం

పిచ్చిమొక్కలతో వైకుంఠధామం



ఖేడ్ మండలం ఖాంజీపూర్‌లోని వైకుంఠధామంలో లోపల, బయట పెరిగిన మొక్కలు

నారాయణఖేడ్ మండలం ఖాంజీపూర్‌లోని చెరువుకు సమీపంలో వైకుంఠధామం నిర్మించారు. ఆ వైకుంఠధామం లోపల, ముందు భాగంలో మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించేందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అనువైన స్థలాల్లో నిర్మిస్తే ఈ పరిస్థితి ఉండేది కాదని పలువురు అంటున్నారు.

నారాయణఖేడ్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి)

పొంచి ఉన్న ప్రమాదం..



హవేళిఘణపూర్: రోడ్డుకు ఆనుకుని మిషన్ భగీరథ వాల్

మండల కేంద్రంలో మెదక్-బోధన్ జాతీయ రహదారి(756డీ) విస్తరణ పనులు చేశారు. పనుల్లో భాగంగా మిషన్ భగీరథ వాల్ రోడ్డుకు అంచున ఉంచారు. దీంతో ఈ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు అంచున ఉన్న మిషన్ భగీరథ వాల్‌ను రోడ్డుకు దూరంగా మార్చాలని కోరుతున్నారు.

హవేళిఘణపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి)

చెత్త కంపు..



కాళ్లకల్‌లో రోడ్డు చివర వేసిన చెత్త

కాళ్లకల్ గ్రామంలో ఎక్కడచూసినా చెత్తే దర్శనమిస్తోంది. గ్రామంలో చెత్త సేకరణ జరగకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని పలువురు పేర్కొంటున్నారు. అలాగే కాలనీల్లో రోడ్లపై వారం వరకు చెత్త తీయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు. అధికారులు చెత్తను తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మనోహరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి

సంగారెడ్డి అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని జన జాగృతి సేన అధ్యక్షుడు బంగారుకృష్ణ కోరారు. సంగారెడ్డిలో ఆదివారం ఆయన మాట్లాడారు. నాలుగేళ్ల ప్రొబేషన్ పీరియడ్ నిబంధన పెట్టి ఏడేళ్లయినా రెగ్యులరైజ్ చేయకపోవడం అన్యాయమన్నారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలకపాత్ర పోషించే జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చింతల సాయి, భానుప్రసాద్ పాల్గొన్నారు.

పథకాల అమల్లో ప్రభుత్వం విఫలం

పుల్‌కల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ప్రభుత్వం విఫలమైందని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ జిల్లా కమిటీ సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య ఆరోపించారు. ఆదివారం తాడ్దానిపల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరుపేదలకు నీడనిచ్చేందుకు ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ముందుకు సాగడం లేదని ఎద్దేవా చేశారు. అబద్దాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తే సహించేది లేదన్నారు.

బీజేపీ జెండా ఆవిష్కరణ

పుల్‌కల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా చౌటకూర్ మండల పోసానిపల్లి గ్రామంలో ఆ పార్టీ యువ నాయకుడు చంటి దేవిక ప్రభు ఆదివారం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

నేటి నుంచి సయ్యద్ లతీఫ్ దర్గా ఉర్సు

జహీరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం గుడిపల్లి గ్రామ శివారులో వెలిసిన సయ్యద్‌లతీఫ్ దర్గా ఉర్సు (సిద్దపీర్ల) ఉత్సవాలు ఈనెల 3, 4న నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలను తిలకించేందుకు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారన్నారు. రెండురోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భక్తులు, అభిమానులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

తూప్రాన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో సోమవారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తూప్రాన్ డీఈ గరత్‌మంత్‌రాజ్, ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని తూప్రాన్, మనోహరాబాద్, మాసాయిపేట, వెల్దుర్తి, శివ్వంపేట మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై వినతులు చేయవచ్చని సూచించారు. వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆయా మండలాల విద్యుత్ ఏఈలు అందుబాటులో ఉంటారన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

జహీరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉద్యోగుల సమస్యలను, పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డం జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్‌లో నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా నాట్యమండలి

సంగారెడ్డి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజానాట్యమండలి కళల కోసం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్నదని సంఘం రాష్ట్ర కార్యదర్శి నర్సింహా అన్నారు. సంగారెడ్డిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజానాట్యమండలి అంటేనే ఆట పాటలతో ప్రజలను చైతన్యపరిచేదని, మండలం, గ్రామా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి పటిష్టం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారన్న, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజనేయులు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే



పటాన్‌చెరు నర్రాబస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధి నర్రా బస్తీలో పర్యటించారు. ముందుగా హనుమాన్ ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్థానికులతో కలిసి పర్యటించారు. స్థానికంగా సమస్యలు అడిగి తెలుసుకుని మాట్లాడారు. హనుమాన్ ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి తనవంతు సహకారం చేస్తానని చెప్పారు. బస్తీల్లో సమస్యలు గుర్తించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాసాల సుధాకర్, నాయికోటి రాజు తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే విజయం : మైనంపల్లి



కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌తో కలిసి ప్రచారంలో హనుమంతరావు, మండల నాయకులు

మనోహరాబాద్/మునిపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలవడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ చేపట్టిన పాదయాత్రలో హనుమంతరావు మనోహరాబాద్ మండల నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, సత్యనారాయణ, మల్లేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో గెలిచేది బీఆర్‌ఎస్సే

మునిపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు ఖాయమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చంటి రాహుల్‌కిరణ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బుదేరా చౌరస్తాలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీలు అంటూ ఎన్నికల్లో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలంటే బీఆర్‌ఎస్‌కు ఓటేసి సునీతను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మంతూరి శశికుమార్, మాజీ ఎంపీపీ చంద్రయ్య, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు ఆనంద్, నాయకులు విఠల్, భాగన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే పేదల అభివృద్ధి : రాజిరెడ్డి



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న రాజిరెడ్డి

2ఎన్‌ఎస్‌పీ ఎస్‌విపీటీ 2: శివ్వంపేట, సికింద్లాపూర్‌లో ఇందిరమ్మ ఇల్లును ప్రారంభిస్తున్న రాజిరెడ్డి

శివ్వంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల బీఆర్‌ఎస్ హయాంలో ఒక్క నిరుపేద కుటుంబానికి పక్కా ఇళ్లు రాలేదని, కాంగ్రెస్ హయాంలోనే పేదలు అభివృద్ధి చెందుతారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సికింద్లాపూర్‌లో గ్రామానికి చెందిన రాచోటి రాములమ్మ, లచ్చాగౌడ్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తవడంతో మండలంలోని మొదటిసారిగా ఇందిరమ్మ ఇంటిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నవీన్‌గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

మునిపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మంత్రి దామోదర్ సహకారంతో మండలం ఎంతో అభివృద్ధి చెందుతందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని లింగంపల్లి గురుకుల సొసైటీ భవన నిర్మాణానికి రూ.7.40 కోట్లు మంజూరు పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాంరెడ్డి నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రసూల్‌పటేల్, మాజీ ఎంపీటీసీలు పాండు, యాదయ్య పాల్గొన్నారు.

వైభవంగా చిలుకు ద్వాదశి పూజలు

పెద్దశంకరంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట పట్టణంలోని ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయంలో ఆదివారం సుమారు 100 ఆర్యవైశ్య మహిళలు చెరకు కట్టెలతో చిలుకు ద్వాదశ పూజలు నిర్వహించారు. కృష్ణుడికి, మోహినిదేవికి వేదపండితుల మధ్య పూజలు నిర్వహించి, హారతులు ఇచ్చారు.

స్వర్ణకారులు సంఘటితమైతేనే హక్కులు సాధించగలం

● మెదక్ జిల్లా అధ్యక్షుడు పూర్ణరవిచారి

నర్సాపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణకారులు సంఘటితమైతేనే తమ హక్కులను సాధించుకోగలమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పూర్ణరవిచారి పేర్కొన్నారు. ఆదివారం నర్సాపూర్‌లోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో పట్టణ స్వర్ణకారుల సంఘం కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడిగా భాస్కరచారి, ఉపాధ్యక్షుడిగా వినోద్, సలహాదారులుగా రామాచారి, నర్సింహాచారిలు ఎన్నికయ్యారు. వీరిని జిల్లా ప్రతినిధులు సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం స్వర్ణకారులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్‌చారి, ఉపాధ్యక్షులు కృష్ణకుమార్, పాండురంగచారి, భిక్షపతి, వేణు తదితరులు మాట్లాడారు.

మన లైబ్రరీతో ప్రయోజనం



మాట్లాడుతున్న మనలైబ్రరీ వ్యవస్థాపక అధ్యక్షురాలు డా.విజయలక్ష్మి

జహీరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మనలైబ్రరీ కార్యక్రమంతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని మనలైబ్రరీ వ్యవస్థాపక అధ్యక్షురాలు డా.విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం డీఏఎస్-కేవీకే ఆవరణలో విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడానికి పోటీ పరీక్షలు దోహదపడుతాయన్నారు. అందులో భాగంగా విద్యార్థులకు కథారచన, చిత్రలేఖనం తదితర కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఇందులో 24 పాఠశాలలకు చెందిన 160 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మన లైబ్రరీ వ్యవస్థాపక సభ్యులు డా.శివబాబు,పూలమ్మ, రాంచందర్, రాంచంద్రయ్య, యూసుఫ్, లక్ష్మి పాల్గొన్నారు.

కల్లుగీత వృత్తి రక్షణకు ఉద్యమ కార్యాచరణ

● కేజీకేఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆశన్నగౌడ్, రమేష్‌గౌడ్

సంగారెడ్డి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత వృత్తి రక్షణకు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నామని కేజీకేఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆశన్నగౌడ్, రమేష్ గౌడ్ అన్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన వారు మాట్లాడుతూ సంగారెడ్డిలో 16న నిర్వహించే కల్లు గీత కార్మిక సంఘం (కేజీకేఎస్) జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో కల్లుగీత వృత్తి రక్షణ, గీత కార్మికుల ఉపాధి, గౌడ కులస్థుల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన అనేక అంశాలపై చర్చించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, నాయకులు భూమాగౌడ్, యాదాగౌడ్ పాల్గొన్నారు.

రహదారి తవ్వి ర్యాంప్..!

● కొల్లూరులో ఓ బిల్డర్ నిర్వాకం



ర్యాంపు కోసం రాడ్లు చుడుతున్న కూలీలు

రామచంద్రాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో బిల్డర్లు అధికారులను ఏ మాత్రం లెక్కచేయడం లేదు. ప్రణాళికలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమాల విషయంలో అధికారులకు ప్రసన్నం చేసుకుని ఇష్టానుసారంగా వ్యవరిస్తున్నారు. కొల్లూరులో ఓ అపార్టుమెంట్ నిర్మాణదారులు విద్యుత్ స్తంభాన్ని దాటి రోడ్డును తవ్వేసి ర్యాంప్ నిర్మాణం ఆదివారం 'ఆంధ్రజ్యోతి' కంట పడింది. వంద ఫీట్ల రోడ్డు నిర్మాణ సమయంలో ఇబ్బందులు తప్పవని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

స్టార్టర్‌లో మంటలు.. నిలిచిన నీటి సరఫరా

కంగ్టి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాగూర్.కెలో తాగునీటి సరఫరాకు సంబంధించిన సింగిల్ ఫేస్ మోటారు స్టార్టర్‌లో శనివారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్టార్టర్‌లో పెద్ద శబ్దంతో పాటు మంటలు రావడంతో గమనించిన స్థానికులు విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలిపేశారు. గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి స్టార్టర్‌కు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్య తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించండి



చౌటకూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మల్లారెడ్డి

పుల్‌కల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని ఆత్మ కమిటీ చైర్మన్ టి.మల్లారెడ్డి రైతులను కోరారు. ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహిపాల్‌రెడ్డితో కలిసి చౌటకూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో కొనుగోలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా గ్రామగ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండల కేంద్రమైన చౌటకూర్‌తో పాటు వెండికోలు, వెంకటకిష్టాపూర్, ఉప్పరిగూడెం, బొమ్మారెడ్డిగూడెం, పోసానిపల్లి గ్రామాల్లో మంత్రి దామోదర రాజనరసింహ ఆదేశాల మేరకు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భానూరి లక్ష్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపనలు



నెహ్రూనగర్‌లో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా పుష్పాదివాసం నిర్వహిస్తున్న దృశ్యం

నారాయణఖేడ్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణంలోని నెహ్రూనగర్‌లో దశాబ్దాల చరిత్ర కలిగిన హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం రెండోరోజు వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా హోమంతో పాటు వివిధ పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠాపనకు సిద్ధంగా ఉన్న విగ్రహాలకు ధాన్యాదివాసంతో పాటు ఫల పుష్పాదివాసాలను పురోహితులు గురుజ్యోషి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

'ఖేడ్'లో తులసీ దామోదర కల్యాణం



ఖేడ్ శివారులోని ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

నారాయణఖేడ్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణ శివారులోని ఓ ఫాంహౌస్‌లో పద్మశాలి సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం తులసీ దామోదర కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉసిరి చెట్టుకు ప్రత్యేక పజలు చేసి దీపాలను వెలిగించారు. అనంతరం మహిళలు వన భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పద్మశాలి సంఘం మహిళా విభాగం సభ్యురాలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అనంతశయన బ్రహ్మోత్సవాలు

నారాయణఖేడ్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సంజీవన్‌రావుపేటలో వెలసిన చరిత్రాత్మక అనంత శయన మందిరంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం మూడోరోజు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ద్వాదశిని పురస్కరించుకుని స్వామివారికి విశేష అలంకరణతో పాటు తులసీ దామోదర కల్యాణం, శేషవాహన సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

ధర్మబద్ధంగా చేసే క్రియలే సత్కర్మలు

● హరేకృష్ణ ఆలయ బాధ్యుడు విభీషణ్ ప్రభూజీ



మాట్లాడుతున్న హరేకృష్ణ ఆలయ బాధ్యులు విభీషణ్ ప్రభూజీ

జహీరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మానవులు నిత్య జీవితంలో దర్మబద్ధంగా చేసే క్రియలే సత్కర్మలుగా భావించబడతాయని సంగారెడ్డిలోని హరేకృష్ణ అలయ బాధ్యుడు విభీషణ్ ప్రభూజీ పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలో ఇస్కాన్ టెంపుల్, హరేరామ హరేక్రిష్ణ సంస్థాన్ ఆధ్వర్యంలో హనుమాన్ మందిరం వద్ద 179వ నగర సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఫలితాలను ఆశించి కర్మలు చేసేవారు అల్పులన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

'ఖోఖో' మెదక్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

నర్సాపూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఖోఖో మెదక్ జిల్లా అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం నర్సాపూర్‌లో నిర్వహించిన న్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.హరికిషన్, ప్రధాన కార్యదర్శిగా బాసంపల్లి శ్రీకాంత్‌గౌడ్, కోశాధికారిగా నాగాగౌడ్, ఉపాధ్యక్షుడిగా రామేశ్వర్‌రెడ్డి, నవీన్, జాయింట్ సెక్రటరీగా హరికిషన్‌త్రిశూల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రతినిధి సాయిరాం రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించగా.. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి, రాష్ట్ర పరిశీలకులు శ్యాంప్రసాద్ హాజరయ్యారు.

అ'పూ'ర్వ సమ్మేళనం



సమ్మేళనంలో విద్యార్థులు

చేగుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-21 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండలంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. 25 ఏళ్ల తర్వాత కలిసిన వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఆనాటి గురువులను సత్కరించారు.

కరసేవకుల త్యాగాలు స్మరించుకోవాలి : సుభాష్‌చందర్



సంగారెడ్డిలో రక్తదానం చేస్తున్న యువకులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కరసేవకుల త్యాగాలు స్మరించుకోవాలని విశ్వహిందూ పరిషత్ ధర్మ ప్రసాద రాష్ట్ర సహ ప్రముఖ్ మధురనేని సుభాష్‌చందర్ సూచించారు. సంగారెడ్డిలోని సాయిరాం హాస్పిటల్‌లో హుతాత్మా దివాస్ సందర్భంగా రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరసేవకుల త్యాగాలను స్మరించుకుంటూ బజరంగ్‌దళ్ కార్యకర్తలు ప్రతి ఏటా హుతాత్మా దివాస్ పేరుతో రక్తదానం చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి జయరాం రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పవన్, సహప్రముఖ్ మనోజ్, లక్ష్మణ్, డా.రాజుగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలపై బీజేపీ నిరసన

దేశ రక్షణ వ్యవస్థను కించపరిచే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్



నర్సాపూర్‌లో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో సీఎం బ్యానర్‌తో నిరసన



సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ జిన్నారంలో బీజేపీ నాయకుల ఆందోళన